విశాలాంధ్ర గోదావరి జిల్లా

ఏలూరు, పశ్చిమగోదావరి

వైద్య సేవలు విలువ కట్టలేనివి

- జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: వైద్యులు కరోనా సమయంలో చేసిన సేవలు విలువ కట్టలేనివి .. వైద్యులు ప్రత్యక్ష దైవం అని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు.శుక్రవారం కాళ్ళ మండలం పెదమిరం రాధా కృష్ణ కన్వెన్షన్ లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే ఫ్యామిలీ మీట్ సమావేశంలో జిల్లా కలెక్టరు ముఖ్య అతిథిగా

హాజరయ్యారు. డాక్టర్స్ డే సందర్భంగా డాక్టర్స్ అందరికీ శుభాకాంక్షలు, అభినందనలను జిల్లా కలెక్టరు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ అందరికీ ఆరోగ్యం ముఖ్యం అని ఎంతటి భయంకరమైన వ్యాధుల్లో నుంచైనా బయటికి తీసుకువచ్చి ప్రాణాలు కాపాడ కలిగేది ఒక్క డాక్టరుకు మాత్రమే సాధ్యం అన్నారు. మరణానికి చేరువైన వారిని తిరిగి పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా చేసే డాక్టర్స్‌కు సమాజంలో ఎంతో గౌరవం ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్స్ కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబాన్నికి మంచి ఆరోగ్య సేవలు అందిస్తున్నామన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తరపున 50 సంవత్సరాలు వైద్య సేవలు అందించిన 75 సంవత్సరాలు దాటిన డాక్టర్స్ 25 మందికి వారి కుటుంబ సభ్యుల మధ్య జిల్లా కలెక్టరు ఘనంగా సన్మానించారు. వారి యోగ క్షేమాలను, సేవలను జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తరపున జిల్లా కలెక్టరు పి.ప్రశాంతికి సన్మానం చేసి జ్ఞాపికను అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. డి.మహేశ్వర రావు, ఐ యమ్ ఏ ప్రెసిడెంటు డాక్టర్ జి. బాల కృష్ణ, కార్యదర్శి డాక్టర్ యన్.శంకర్ కుమార్ వర్మ, కల్చర్ కమిటీ చైర్మన్ ముదునూరి. గోపాల కృష్ణంరాజు, ఆశ్రమం డాక్టరు వేగిరాజు రామ కృష్ణంరాజు, డాక్టర్స్ వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల సిబ్బంది అంకితభావంతో ప్రజలకు సేవలు అందించాలి

విశాలాంధ్ర-ఏలూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను, ప్రభుత్వ సంకల్పాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లడంలో అంకితభావంతో పనిచేయాలని సచివాలయ సిబ్బందికి ఏలూరు ఎమ్మెల్యే

ఆళ్ల నాని సూచించారు. శుక్రవారం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రొబేషన్ ప్రకటించి నేటితో ఏడాది పూర్తయిన సందర్భంగా ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయ సిబ్బంది, శుక్రవారం స్థానిక శాసనసభ్యులు ఆళ్ల నాని క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. శాసనసభ్యులు ఆళ్ళ నాని చేతుల మీదుగా సచివాలయం సిబ్బంది కేకు కట్ చేయించి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఆళ్ల నాని మాట్లాడుతూ సచివాలయాల ఏర్పాటు ద్వారా ప్రజలు వారి సమస్యలపై దూర ప్రాంతాల్లో ఉన్న ఆఫీసులు చుట్టూ తిరిగే ప్రసక్తి లేకుండా నేరుగా వారి గ్రామాల్లోనే పథకాలు అందించే విధంగా ఏర్పాటు చేయడం, ప్రజల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, కో ఆప్షన్ సభ్యులు.ఎస్ ఎం ఆర్ పెదబాబు, డిప్యూటీ మేయర్ జి. శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ ఎస్. రాధా, అడిషనల్ కమిషనర్ బాపిరాజు వార్డు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - కలిదిండి: గ్రామాలలో జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ప్రియ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాలలో పేకాట, చిత్తులాట, కోడి పందాలు నిర్వహిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. కలిదిండిలో ట్రాఫిక్ సమస్య లేకుండా చూస్తామన్నారు. రాత్రిపూట సమయంలో బీటు కానిస్టేబుల్ ఏర్పాటుచేసి గ్రామాలకు పంపుతున్నట్లు తెలిపారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - లింగపాలెం : యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా ఉండేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రత్యేక ఎన్ఫోర్స్ మెంట్ (ఎస్ఇబి) చేస్తున్న కృషి మంచి ఫలితాన్ని స్తుందని లిడ్‌క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్ అన్నారు. శుక్రవారం ఈయన ఎస్ఇబి అడిషినల్ ఎస్పీ నక్కా సూర్య చంద్రరావును కలిశారు. ఈ సందర్భంగా యువతను మంచి మార్గంలో పెట్టేందుకు ఎన్ఫోర్స్‌మెంట్ నిర్వహిస్తున్న అవగాహన సదస్సులు గ్రామీణ ప్రాంతాలలో ఎంతగానో ఉపయోగపడుతున్నాయని అన్నారు. ఇటువంటి

కార్యక్రమాలకు స్వచ్ఛంద సంస్థలు, ప్రతీ ఒక్కరు పోలీసులకు సహకరించాలన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటుపడి జీవితాలను పాడుచేసుకున్న యువకులు ఎందరో ఉన్నారని, అటువంటివి ఇకపై జరగకుండా చూడాల్సిన బాధ్యతను ప్రతీ ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని అడిషినల్ ఎస్పీ సూచించారు. లిడ్‌క్యాప్ డైరెక్టర్‌గా స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేస్తున్న తీరుపై ఎస్పీ సందీప్‌ను అడిగి తెలుసుకున్నారు.

నాణ్యతలేని జగనన్న ఇళ్ల నిర్మాణాలు

విశాలాంధ్ర-ఏలూరు: లక్ష్మీపురంలో ప్రభుత్వం ఇచ్చిన జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కరువయ్యా యని టిడిపి ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం జగనన్న కాలనీ స్థితిగతులను పరిశీలించడానికి టిడిపి ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి

చంటి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా బడేటి చంటి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం గత 3 సంవత్సరాల క్రితం ఏలూరుకు సుమారు 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న దెందులూరు నియోజకవర్గం సరిహద్దులో ఉన్న లక్ష్మీపురం గ్రామంలో ఏలూరు ప్రజలకు జగనన్న కాలనీ పేరుతో ఖాళీ స్థలాల పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఆ ఖాళీ స్థలాల్లో ప్రభుత్వమే ఇల్లు కట్టించి ఇస్తామని చెప్పి ఒక్కొక్క లబ్ధిదారు రూ. 35వేలు చెల్లించాలని డ్వాక్రా సంఘాల ద్వారా ఒత్తిడి చేసి వసూలు చేశారు, కానీ నాణ్యంలేని కట్టడాలు అసంపూర్తిగా నిర్మించడం వలన ఇప్పటికే కొన్ని కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయని ఆరోపిం చారు. లక్ష్మీపురం గ్రామం నుండి ప్రతిరోజు పనుల నిమిత్తం ఏలూరు వచ్చి వెళ్లా లంటే సుమారు రూ.400 లబ్ధిదారులకు ఖర్చు అవుతున్న కారణంగా ఆ కట్టడాల ప్రదేశం వద్దకు కూడా లబ్ధిదారులు వెళ్లలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసంపూర్ణంగా ఉన్న ఇళ్లను ప్రభుత్వమే అన్ని వసతులతో నిర్మించి లబ్ధిదారులకు అందచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావు సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర -ఏలూరు: డిఆర్డిఏ సంస్థలో దఫేదారుగా 39 సంవత్సరాలు పనిచేసిన జాగర్లమూడి వెంకటేశ్వరరావు శుక్రవారం పదవీ విరమణ సందర్భంగా డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు వెంకటేశ్వరరావును పుష్పగుచ్ఛం, శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. వట్లూరు

టిటిడిసిలో డిఆర్డిఏ పిడి ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడి విజయరాజు మాట్లాడుతూ వెంకటేశ్వరరావు అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. వెంకటేశ్వరరావు సహోద్యోగులు విధినిర్వహణలో ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పిడి తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఎపిడి ఇ. అనిత, డిఆర్డిఏ సిబ్బంది, డిపియంఎస్ మరియు ఎపిఎంఎస్, జిల్లా సమాఖ్య పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు ఉపసంహరించాలి

విశాలాంధ్ర-ఏలూరు: పెంచిన విద్యుత్ చార్జీలు తక్షణం ఉపసంహరించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.ప్రజలపై భారాలు మోపే విద్యుత్ ఛార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల బిగింపునకు వ్యతిరేకంగా శుక్రవారం ఏలూరు విద్యుత్ భవన్ వద్ద వామపక్ష పార్టీల, ప్రజా సంఘాల ధర్నా నిర్వహించాయి. ఆరు రకాల పేర్లతో విద్యుత్ బిల్లులు పెంచడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపాలని, ప్రజలపై భారాలు మోపడం సిగ్గు సిగ్గు, 2020 విద్యుత్ సంస్కరణల చట్టాన్ని ఉపసంహరించాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ ధర్నాలో పాల్గొన్న డేగా ప్రభాకర్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం 2020లో విద్యుత్ సంస్కరణల చట్టం తీసుకువచ్చిందని, అనేక రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ సంస్కరణలను వ్యతిరేకిస్తున్నాయని, బిజెపి పాలిత రాష్ట్రాలు కూడా అమలుకు విముఖత వ్యక్తం చేస్తున్నాయని అన్నారు. మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ అత్యుత్సాహంతో అమలు చేయడానికి ఉవ్విళ్లూరు తున్నారని ఎద్దేవా చేశారు.2014 నుండి 2023 వరకు వాడిన విద్యుత్తుకు అదనంగా 80 పైసలు భారం మోపి పేద ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. విద్యుత్ మీటర్ల కొనుగోలులో కూడా కోట్ల రూపాయల అవకతవకలు జరుగుతున్నాయని అన్నారు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ కేంద్రంతో పోరాడలేక, అదనపు రుణాల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన విద్యుత్ సంస్కరణలు అమలు చేసేందుకు, పేదలపై భారాలు మోపేందుకు కుట్ర చేస్తున్నదని అన్నారు. మోడీ ఆదేశాలకు లొంగిపోయిన జగన్ వంటగ్యాస్ పెంచిన విధంగానే విద్యుత్ చార్జీలు పెంచడానికి సిద్ధపడ్డారని విమర్శించారు. తక్షణం విద్యుత్ చార్జీల పెంపుదల, స్మార్ట్ మీటర్ల బిగింపు నిర్ణయాన్ని ఉప సంహరించాలని డిమాండ్ చేశారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ అధికార ప్రతినిధి యు. వెంకటేశ్వరరావు, సిపిఎం జిల్లా నాయకులు బి. సోమయ్య, ఎం. సిపిఐ (యు) జిల్లా నాయకులు ఎస్. నాగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ- షాల ప్రభుత్వం 2020లో తీసుకొచ్చిన విద్యుత్తు సంస్కరణల చట్టాన్ని అమలు చేయటంలో రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం ముందు బాగాన ఉండి ప్రజలపై తీవ్రమైన భారాల మోపుతున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కొండేటి బేబి, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య, మహిళా సమాఖ్య నగర కార్యదర్శి అడ్డగర్ల లక్ష్మి ఇందిర,సిపిఐ ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శి కురెళ్ళ వరప్రసాద్, తెర్లాపు శ్రీను, నాగం అచ్యుత్, బేత శంకర్, బుగ్గల ప్రభాకర్, పోటేలు పెంటయ్య, పోలా భాస్కర్,యర్రా వెంకటేశ్వరరావు, గేదెల నాగేశ్వరరావు, ఎం ఏ హకీమ్, బి కే ప్రసాద్, కొల్లూరి సుధారాణి, ఉప్పులూరి లక్ష్మి, ఉప్పులూరి భవాని, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు బద్దా వెంకట్రావు, ఎర్రా శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు వి.సాయిబాబా, ఐ.ఎఫ్.టి.యు.నాయకులు బద్దా వెంకట్రావు, ఎం. రాము, బి.వీరభద్రం, రమణ, వెంకటేష్, రాజు,పల్లి గంగరాజు, అప్పారావు, పి.త్రినాథ్, నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన విద్యుత్ చార్జీలు ఉపసంహరించకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, సిపిఎం జిల్లా కార్యదర్శి బి, బలరాం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విద్యుత్ సంస్కరణల పేరుతో వ్యవస్థలను నాశనం చేయొద్దని డిమాండ్ చేస్తూ శుక్రవారం భీమవరం ఎలక్ట్రికల్ డిఈ కార్యాలయం వద్ద వామ పక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సూచనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణ అమలు చేయడం ద్వారా ప్రజలపై భారాలు పడుతున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ వినియోగ చార్జీలు, ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో సామాన్య ప్రజలు నడ్డి విరిచే విధంగా రేట్లు పెంచిందని

వెంటనే ఉపసంహరించాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎం.సీతారాం ప్రసాదు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎం.లక్ష్మీపతి, ఫార్వర్డ్ బ్లాకు డివిజన్ కార్యదర్శి డి.శ్రీనివాసరాజు తదితరులు మాట్లాడారు. సిపిఐ నాయకులు వై.వి.ఆనంద్, పి.యోహాను, సిపిఎం నాయకులు బి వాసుదేవరావు, ఎం.వైకుంఠరావు, ఎం.ఆంజనేయులు, బొక్క సత్యనారాయణ, కనుమూరి వెంకటపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

వేలేరుపాడులో : పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యుత్ సబ్ స్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ముందుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ

విధానాలపై వ్యతిరేక నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి బాడిశ రాము మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఇష్టానుసారంగా విద్యుత్ ఛార్జీలను పెంచడం వలన సామాన్య ప్రజలకు ఆర్థికంగా ఎంతో భారమవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద, బడుగు బలహీన వర్గాల ప్రజల పరిస్థితులు పట్టని ప్రభుత్వాలు ధనార్జనే లక్ష్యంగా పనిచేయటం సిగ్గుచేటని విమర్శించారు. అనంతరం ఆ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి కారం దారయ్య, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి ఎర్ర మధు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కురిమెళ్ళ వెంకటేశ్వర్లు, కరటం వెంకటేశ్వర్లు, కారం బొజ్జి, పిట్టా సాయమ్మ, సోడే కన్నారావు, పిట్టా మల్లయ్య, సునీత, రజిని, కళ్యాణి, నర్సమ్మ, కర్నాటి రమేష్, నిమ్మగడ్డ వెంకటేష్, సరియం నాగులు తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడిలో : పెంచిన విద్యుత్ చార్జీలు ఉపసంహరించుకోవాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. చింతలపూడి ఏడీ కార్యాలయం వద్ద సిపిఐ, సిపిఎం, టిడిపి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సిపిఎం నాయకులు ఎస్.సూర్యకుమార్, టిడిపి పట్టణ

అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, విద్యుత్ కోతలు అరికట్టాలని డిమాండ్ చేశారు. 200 యూనిట్ల వినియోగం పెరిగితే సంక్షేమ పథకాలు రద్దు చేసే విధానాన్ని అరికట్టాలన్నారు. సిపిఐ మండల సహాయ కార్యదర్శి పుల్లూరు సోమశేఖర్, ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి దొంతా కృష్ణ, టిడిపి నియోజకవర్గ నాయకులు మారుమూడి థామస్ మాట్లాడుతూ వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే విధానాన్ని ఉపసంహరించుకోవాలని అన్నారు. ఈ ధర్నాలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు, సిపిఐ మండల కౌన్సిల్ సభ్యులు ఎస్.కె జానీ, ఎస్.కె కాలేషా, మాణిక్యాలరావు, సిపిఎం నాయకులు వాసు, టిడిపి పట్టణ కార్యదర్శి బోడ నాగభూషణం, ఐటిడీపీ నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్, మన్యం సత్తిబాబు, ఏఐటీయూసీ నాయకులు అప్పారావు, రానుబోయి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడులో: విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సిపిఐ మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన విద్యుత్

బిల్లులతో జనానికి షాక్ కొట్టిస్తూ ప్రజల కళ్ళు కప్పి విద్యుత్ చార్జీలు పెంచి సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయని దుయ్యబట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సంఘం నాయకులు బండారు శ్రీనివాసరావు మాట్లాడుతూ సామాన్యుడు విద్యుత్ బిల్లులు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఇనుకోటి వెంకటరావు, సురగాల రాంబాబు, దిద్ది నాగేశ్వరరావు, చింతాడ ఫ్రాన్సిస్, మోర్ల రాజేష్ లు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, ప్రజలపై సర్దుబాటు, ట్రూప్ చార్జీల పేరుతో భారాలు ఆపాలని కోరుతూ సిపిఐ, తాడేపల్లి గూడెం సిపిఎం, వామపక్షాల ఆధ్వర్యంలో పట్టణంలో జయలక్ష్మీ థియేటర్ ఎదురుగా ఉన్న సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం ఏఈకి వినతి పత్రం అందజేశారు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు, సిపిఎం పట్టణ కార్యదర్శి నాగేశ్వరరావు, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ గృహ విద్యుత్ వినియోగదారులపై రూ. 4300 కోట్లు భారాన్ని పేద, మధ్యతరగతి ప్రజలపై మోపడంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో సతమతమవుతున్న ప్రజానీకం నెత్తిన విద్యుత్ సంస్కరణలు అమలు పేరుతో విద్యుత్ చార్జీలు పెంచడాన్ని తీవ్రంగా ఖండించారు రైతులపై పెనుభారంగా మారే షరతులను తిరస్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జవ్వాది శ్రీను, గొన్నాబత్తుల నాగేశ్వర రావు, జనపరెడ్డి ఈశ్వరరావు, పతివాడ నాగేంద్రబాబు, యడవల్లి వెంకన్న,అయినాల ధర్మారావు, అయినాల సత్యనారాయణ, అగుర్తుల రామోహనరావు, రోకళ్ళ లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరులో : పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి డిమాండ్ చేశారు. సిపిఐ మండల

కమిటీ ఆధ్వర్యంలో కుక్కునూరు సబ్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మైసాక్షి వెంకటాచారి మాట్లాడుతూ సర్దుబాటు పేరుతో రకరకాలుగా విద్యుత్ చార్జీలను పెంచి పేద ప్రజలపై పెను భారాలు వేస్తున్నారని విమర్శించారు. ట్రూ అప్, ఫిక్స్ చార్జీలు, కస్టమర్, సర్ చార్జీలు, విద్యుత్ సుంకం రకరకాల పేర్లతో జనాలను పీల్చి పిప్పి చేస్తున్నారని విమర్శించారు. తక్షణం ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో జిల్లా సమితి సభ్యులు అయితా సురేష్, కొన్నే లక్ష్మయ్య, రవ్వా అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో : రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీల పేరుతో పేద ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నదని, పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని

డిమాండ్ చేశారు. కొయ్యలగూడెం మండలం బోడిగూడెం గ్రామంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీల పేరుతో పేదవాడి నడ్డి విరుస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అదనపు చార్జీల పేరుతో గత సంవత్సరం వందలాది కోట్ల రూపాయలు వసూలు చేస్తోందన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో నిరసన జ్వాలలు మొదలవుతాయని శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మెంటి శ్రీను, జక్కు వెంకటేశ్వర రావు, దొర దుర్గారావు, ఇళ్ల నరసయ్య, జక్కుల దొరబాబు, కట్టవ సాయి. తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్‌లో : విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకిస్తూ స్థానిక చిన్నగాంధీ బొమ్మ సెంటర్లో సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా

సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఒకేసారి సర్దుబాటు చార్జీల పేరుతో వినియోగదారుల జేబుకు చిల్లులు చేస్తున్నాయన్నారు. గత సంవత్సరం కరెంటు చార్జీలు పెంచి రూ.1400 కోట్ల భారం మోపిందన్నారు. మళ్లీ సర్దుబాటు చార్జీల పేరుతో జనం నెత్తిన తాజాగా రూ.6వేల కోట్లు ప్రజల నెత్తిన భారం మోపాయన్నారు .విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, నాయకులు ఎం నాగేంద్రరావు, గంగాధర్, ముఖర్జీ, సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు జి రాజు, నాయకులు హనుమాన్లు, వసంతరావు, దుర్గారావు మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో: ప్రజలపై భారం మోపుతున్న విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని సిపిఐ నాయకులు గవరవరం విద్యుత్ ఉపకేంద్రం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ కొయ్యలగూడెం

మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు ,కామవరపుకోట మండల కార్యదర్శి టీవీఎస్ రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ విద్యుత్ ఛార్జీలను పెంచి సామాన్య మానవుల నడ్డి విరుస్తున్నారన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని కోరుతూ విద్యుత్ ఉపకేంద్ర సిబ్బందికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్ర మంలో మండల సహాయ కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, పట్టణ కార్యదర్శి ఎస్ కె బాజీ, మట్ట రామకృష్ణ, ఎస్ గిరి, రాంబాబు, వెలగా నాని తదితరులు పాల్గొన్నారు.

మహిళలను వ్యాపారస్తుల్ని చేయటం లక్ష్యం

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: జిల్లాలో వెయ్యి మంది మహిళలను వ్యాపారస్థులను చేయటం లక్ష్యమని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్. విజయ్ రాజు తెలిపారు. శుక్రవారం కొయ్యలగూడెం మండలం కనకాద్రిపురం గ్రామంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తోట కృపామణి

ఆధ్వర్యంలో చిరుధాన్యాల ఆహార ఉత్పత్తులు యూనిట్ ప్రారంభోత్సవం చేశారు. గుడ్ హెల్త్ ఫుడ్స్ పేరుతో మహిళలు తయారు చేసే ఉత్పత్తులు రుచి చూసి వాటిని తయారు చేసే యంత్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ ముఖ్య అతిధిగా మాట్లాడారు. చిన్న గ్రామంలో ఇలాంటి ఆరోగ్య కరమైన ఉత్పత్తులు మహిళలు తయారు చేయటం ముదావాహంగా పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలో వెయ్యి మంది మహిళలను వ్యాపారస్థులుగా చేశామన్నారు. ఈ ఏడాది మరో వెయ్యి మందిని వ్యాపారస్తులుగా చేయాలని లక్ష్యంగా నిర్దేశించామన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి మాట్లాడుతూ ఆరోగ్యానికి అవసరమైన చిరుధాన్యాల పట్ల ప్రజలకు అవగాహన అవసరమని అభిప్రాయ పడ్డారు. ప్రస్తుత రోగగ్రస్త సమాజంలో చిరుధాన్యాల ఆహారం అవసరమని సూచించారు. జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్ బేతాళ రిబ్కా రాణి మాట్లాడుతూ మహిళలు తమ కాళ్ళపై తాము నిలబడటానికి ఉన్న అవకాశాలను సద్వినియోగపరుచుకోవాలన్నారు. మండల పరిషత్ అధ్యక్షులు గంజిమాల రామారావు మాట్లాడుతూ చిరుధాన్యాల ఉత్పత్తుల మార్కెట్‌కు సహకారం అందిస్తామని చెప్పారు. జెడ్పీటిసి సభ్యురాలు , విద్య ఆహార సలహా స్టాండింగ్ కమిటీ సభ్యురాలు దాసరి శ్రీలక్ష్మి మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నట్లే వ్యాపార రంగంలో కూడా విజయం సాధించాలని ఆకాక్షించారు. జీవనోపాధుల ప్రాజెక్టు డి.పి.ఎం విజయ కుమారి, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు మట్టా వనజ, ఎంపిడిఓ బేబీ శ్రీలక్ష్మీ, యూనియన్ బ్యాంక్ మేనేజర్ మరడ రాజేష్, కుంతలగూడెం వైయస్సార్ గ్రామ కమిటీ అధ్యక్షులు కన్నాబత్తుల బాలస్వామి మాట్లాడారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తోట కృపామణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిసిలు శ్రీనివాస్, సాయేంద్రరావు పలువురు సిఏ లు,మండల మహిళా సమాఖ్య కార్యదర్శి గంగాదేవి ,కోశాధికారి కనకరత్నం, శాంతి వెల్ఫేర్ అసోషియేషన్ (కొవ్వూరు) ప్రధాన కార్యదర్శి బేతాళ విజయ్ కుమార్ కనకాద్రిపురం డ్వాక్రా గ్రూపు లీడర్లు రాపోలు రాజేశ్వరి, నలమాటి సత్యభామ,చిన్నం గవరమ్మ, తోట శాంత కుమారి,చాపల కుమారి, దుదుగు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సజీవంగా లేని నాన్న కోసం కొడుకు.. భర్తలేడని తెలిసి భార్య.. కుటుంబంలో విషాదం

విశాలాంధ్ర - లింగపాలెం : పనికి వెళ్ళి వచ్చాక బాబుకు బట్టలు, పుస్తకాలు కొనుక్కొద్దాం సిద్ధంగా ఉండమని భార్యకు... బాబు నీకు కావాల్సినవన్నీ కొనిపెడతానని కొడుక్కి చెప్పి... కరెంటు పనికి వెళ్ళి స్తంభం పై నుంచి పడి ప్రాణాలు కోల్పోయిన సంఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది. కుటుంబానికి ఆధారమైన భర్త ఇక లేడని తెలిసి మృతుని

భార్య శకుంతల తల్లడిల్లుతోంది. బడికి వెళ్ళటానికి అన్నీ కొనిస్తాడన్న నాన్న ఇంకా ఇంటికి రాలేదేంటంటూ ఎదురు చూస్తున్న కొడుకుని చూసి మృతుని కుటుంబీకులు, గ్రామస్తులు కంటతడి పెడుతున్నారు. యడవల్లికి చెందిన అబ్బదాసరి విజయరాజు(41) కాంట్రాక్టరు వద్ద కరెంటు పనికి వెళ్ళి మల్లేశ్వరంలో స్తంభంపైకి ఎక్కి వైర్లు లాగే పని చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కింద పడటంతో మృతి చెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి శుక్రవారం పంచనామా జరిపి పోస్టుమార్టంకు పంపారు. ఈ ప్రమాదంపై మృతుని బంధువులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టరు తగు జాగ్రత్తలు తీసుకోకపోవటం వల్ల ఈ ప్రమాదం జరిగిందని ఆరోపిస్తున్నారు. విద్యుత్ నిలిపి పనులు చేస్తున్నా కొన్ని సందర్భాలలో విద్యుత్ సరఫరా అవుతుంది. ఇలా సరఫరా అయ్యేటప్పుడు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఎర్త్‌లు అమర్చుకోవాలి. అటువంటిది చేయకపోవటం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు ఆరోపణలు చేస్తున్నారు. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ప్రమాదంపై ధర్మాజీగూడెం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎంఎస్ఎంఈ పార్క్ పనులు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-ఏలూరు: జి. కొత్తపల్లిలో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు పనులు వేగ వంతం చేయాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా కలెక్టరేట్ లో గౌతమీ సమావేశపు హాలులో జిల్లా పారిశ్రామిక,ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం శుక్రవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్

ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి దిశలో నిలిపేందుకు అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ద్వారకాతిరుమల మండలం జి. కొత్తపల్లి గ్రామంలో మొదటి విడతలో 80 ఎకరాలలో ఎంఎస్ఎంఈ పార్క్ లో ఏర్పాటుచేసేందుకు అనువైన సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుపై అవసరమైన ప్రతిపాదనలు సిద్ధంచేయాలని, వట్లూరులో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు కూడా ప్రతిపాదనలు సిద్ధం చేయాలనీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఏసుదాసు, ఏలూరు ఆర్డీట కె. పెంచెల్ కిషోర్, పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ జోనల్ మేనేజర్ కె. బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

చెత్తా...లేదు...సంపద లేదు

- కలెక్టర్ మాటన్నా లెక్కేలేదా

విశాలాంధ్ర - చాట్రాయి : చెత్త సంపద తయారి కేంద్రాల్లో... చెత్త లేదు...సంపద లేదు...? జిల్లా కలెక్టర్, సిఇఓ, జిల్లా పంచాయతీ అధికారి,సబ్ కలెక్టర్, ఎవరైనా ఏమి చెప్పినా పట్టించుకో కుండా... చెత్త సంపద తయారి కేంద్రాల్లో పని చేసిన క్లాప్ మిత్రాలకు 39నెలలు జీతాలు 15వ ఆర్థిక సంఘం నుంచి వచ్చిన లక్షలాది రూపాయలు నిధులు స్వాహా

చేసారు.చాట్రాయి మండలం చనుబండ చెత్త సంపద తయారి కేంద్రంలో పని చేసిన క్లాప్ మిత్రాలకు జీతాలు ఇవ్వకపోవడం తో జిల్లా కలెక్టర్ కు స్పందనలో ఫిర్యాదు చేశారు.జిల్లా పంచాయితీ అధికారి నిమ్మగడ్డ బాలాజీ చనుబండ వచ్చి పరిశీలన చేశారు.వాస్తవాలను గుర్తించారు.స్థానిక పంచాయతీ అధికారి శివనాగరాజు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు స్వాహా విషయం బయటకు వచ్చింది.తరువాత ఎంజరిగిందో కానీ అంతా సైలెంట్ అయింది.గత జనవరి నెలలో నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు చనుబండ క్లాప్ మిత్రాలు నిరసన తెలిపారు. సిపిఐ,జనసేన పార్టీ లు వారికి మద్దతు పలికాయి.వారం రోజుల్లో మీ జీతాలు మీ బ్యాంకు ఖాతా లోకి వస్తాయని సబ్ కలెక్టర్ హామీ ఇవ్వడంతో పోరాటం విరమించారు.సబ్ కలెక్టర్ వాగ్దానం చేసి 6నెలలు గడుస్తున్నా చాట్రాయి మండల పంచాయతీ అధికారిగా వున్న శివనాగ రాజు క్లాప్ మిత్రాలకు జీతాలు ఇవ్వకుండా పై అధికారులను పక్కదోవ పట్టిస్తూ కాలయాపన చేస్తున్నారని క్లాప్ మిత్రాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మతోన్మాదులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-తణుకు : స్వతంత్ర జర్నలిస్ట్ తులసి చందుపై మతతత్వ వాదులు అసభ్యకరమైన మాటలతో కించపరుస్తూ చంపేస్తామని బెదిరించ డాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణంలో సామాజిక న్యాయపోరాట సమితి

ఆధ్వర్యంలో వివిధ రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సామాజిక న్యాయపోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పేరూరి మురళీకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశం జర్నలిస్టు తులసి చందుకు ఎటువంటి హాని జరిగినా ముఖ్యమంత్రి చంద్రశేఖర్ దే బాధ్యత అన్నారు. ఆమెకు ప్రాణహాని తలపెడతామని హెచ్చరిస్తున్న హిందూ మతోన్మాదులను గుర్తించి చట్టప్రకారం శిక్షించాలని తెలంగాణా ప్రభుత్వాన్ని సమావేశం ఏకగ్రీవంగా డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో దారిదీపం పత్రిక సంపాదకులు డివివిఎస్ వర్మ ముఖ్యవక్తగా మాట్లాడారు. ఈ సమావేశంలో డాక్టర్ రమేష్ చంద్రబాబు, ఒపిడిఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటి రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, ఎస్ఎస్పిఎస్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు గొల్లపల్లి అంబేద్కర్ , సిపిఎం జిల్లా కార్యదర్శి పివి ప్రతాప్, ఎస్సీ ఉద్యోగుల సంఘం కార్యదర్శి కొండే నాగేశ్వరరావు , జనసేన పార్టీ నాయకులు అనుకుల రమేష్, పౌరహక్కుల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కౌరు వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు రామకృష్ణ , మాజీ వైసిపి కౌన్సిలర్ కారుమంచి మిత్ర, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

గ్యాస్ బండ లీక్ అయ్యి తాటాకిల్లు దగ్ధం

విశాలాంధ్ర-టి నరసాపురం: ఏపిగుంట గ్రామంలో గ్యాస్ బండ లీక్ అయ్యి బొక్కా గంగరాజు తాటాకిల్లు శుక్రవారం దగ్ధం అయింది. తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్య దర్శి శీలం వెంకటేశ్వరరావు,తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో తెలుగు దేశం పార్టీ నాయకులు సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించి కూరగాయలు, 8500 రూపాయిలు నగదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధైర్య పడవద్దు తెలుగు దేశం పార్టీ అండగా వుంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సాధనాల బూసిబాబు, కె రాంబాబు, కోరకొండ వెంకట భద్రం,ఇస్తిన వీరబాబు, కె రాజా,సంక్రాంతి సతీష్ , వీరంకి నాగు,గెద్దల, శీను, కంకిపాటి బాబీ, కోరుకొండ ఆంజనేయులు, బచ్చల వెంకటేశ్వరరావు, తాటికొండ వెంకటేశ్వరరావు ,కె వాసు, పెద్ద బాజీ సాహెబ్,తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు రూ.10లక్షలు మంజూరు

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రజా దాహార్తిని తీర్చడమే ప్రధాన లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి శ్రీలక్ష్మి విష్ణు పేర్కొన్నారు. పరింపూడి పంచాయతీలో త్రాగునీటి అవసరాల కోసం సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి, వార్డు సభ్యుల అభ్యర్థన మేరకు ఎస్సి, ఎస్టి ఏరియాలో రెండు బోర్లకు జిల్లా పరిషత్ నిధులనుండి రూ.10లక్షలు మంజూరు చేయించి శుక్రవారం తారకరామా నగర్ లో మంచినీటి బోరు పనులను సర్పంచ్, ఎంపీపీతో కలిసి భూమి పూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. అనంతరం దాసరి శ్రీలక్ష్మి మాట్లాడుతూ మండలంలో తాగునీటి అవసరాల కోసం నిధులు మంజూరు చేయించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ ముప్పిడి విజయకుమారి మాట్లాడుతూ తాగునీటి అవసరాల కోసం నిధులు మంజూరుకు హామీ ఇచ్చి మాట నిలబెట్టుకున్న జెడ్పీటీసీ సభ్యులకు పరింపూడి ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంజిమల రామారావు, స్టేట్ ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాల దేవి, జిల్లా వైసిపి ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు,ఎంపీపీ ఎక్స్ ఎంపీపీ మట్టా సత్తిపండు, మండల పరిషత్ వైస్ ఎంపీపీ మట్ట వనజ,ఉప సర్పంచ్ సంకు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నంపేటలో మర్సకట్ల ప్రభాకర్ సంతాప సభ

విశాలాంధ్ర-చాట్రాయి : ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సిపిఎం నాయకులు మర్సకట్ల ప్రభాకర్ కు అరుణాంజలి అర్పించారు. శుక్రవారం చాట్రాయి మండలం చిన్నంపేట దళితవాడలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం సామాజిక చైతన్య వేదిక జై భీమ్ యువసేన ఆధ్వర్యంలో శుక్రవారం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన తిరువూరు సిపిఎం నాయకులు మర్సకట్ల ప్రభాకర్ రైతు సంఘం సమావేశంనుంచి తిరిగి వస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించారు.ఆయనకు చాట్రాయి మండలం ప్రజా ఉద్యమాలతో షుమారు 30ఏళ్ళ సంబంధం వుంది. ఈ సందర్భంగా కొమ్ము ఆనందం ఈవి శ్రీనివాస్ కొమ్ము నాగేశ్వరరావు మాట్లాడుతూ తన నిత్య జీవితంలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా నమ్మిన సిద్ధాంతం కోసం ఆశయాలకోసం తుదిశ్వాస విడిచే వరకూ పోరాడుతున్నారు.జైబీమ్ యువసేన నాయకులు కొమ్ము నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-ఆకివీడు: ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు అందజేసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి జగన్ ఈ గడపగడపకు ప్రభుత్వం అనే కార్యక్రమం చేపట్టి 150 రోజులు దాటి ప్రజల నుండి విశేష స్పందన వస్తుందని డిసిసిబి చైర్మన్, ఉండి నియోజకవర్గ వైసిపి ఇంచార్జ్ పివిఎల్ నరసింహా రాజు అన్నారు. శుక్రవారం చినకాపవరంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం మాటలు చెప్పి ఊగిపోయే ప్రభుత్వం కాదని, నిరంతరం ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడే ప్రభుత్వమన్నారు.ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎండగండి శ్రీను, ఎంపీపీ కటారి జయలక్ష్మి, మండల అధ్యక్షుడు ధనరాజ్, ఎంపీడీవో కే వాణి, రూరల్ బ్యాంక్ చైర్మన్ కేశిరెడ్డి మురళి, నంద్యాల సీతారామయ్య, మోటుపల్లి గంగాధర్, వైస్ చైర్మన్ పుప్పాల సత్యనారాయణ, చినకాపవరం సర్పంచ్ నాతిరెడ్డి ఆదిలక్ష్మి అన్నవరం, ఐ భీమవరం సర్పంచ్ గాలి సామ్రాజ్యం, కాట్రడ్డి మోహన్,షేక్ హుస్సేన్, కౌన్సిలర్ దొడ్డి జగదీష్, కేశిరెడ్డి దిలీప్, మోర జ్యోతి, జోగి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: స్థానిక వ్యాపార వేత్త గొట్టుముక్కల వంశీరాజు వితరణతో వారి తాత కలిదిండి వెంకటరాజు, జానకమ్మ దంపతుల జ్ఞాపకార్థం పేద మహిళలకు 5కుట్టు మిషన్ లు రోటరీ క్లబ్ ద్వారా శుక్రవారం పంపిణీ చేశారు.స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్ లో రోటరీ అధ్యక్ష,కార్యదర్శులు దాకారపు గోపాల కృష్ణ,కార్యదర్శి వూడా రాంగోపాల్(గోపీ) నిర్వహణలో ఈ కార్యక్రమం జరిగింది.మహిళా సాధికారత కార్యక్రమం లో భాగంగా లిటిల్ ఏంజిల్స్ సంస్థ ప్రతినిధి తాంద్ర పద్మజ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పొందిన ఐదుగురు మహిళలకు ఐదు కుట్టు మిషన్ లు అందచేశారు.రోటరీ అధ్యక్షుడు దాకారపు కృష్ణ మాట్లాడుతూ సమాజానికి సేవచేసే అవకాశం గత మూడు సంవత్సరాలు రోటరీ నేపద్యంలో శక్తివంచన లేకుండా తమ వంతు సేవను అందించామని,దాత గొట్టుముక్కల వంశీరాజు తమ వంతు సహకారం అందించినందుకు కృతజ్ఞత లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల రాయపరాజు, 17 వ వార్డ్ కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు,మంతెన సత్యనారాయణ రాజు,చామర్తి శ్రీరాములు, రొంగల దేవీప్రసాద్, బవిరిశెట్టి హనుమాన్ తిలక్, గణిత ఆనంద ప్రసాద్,ధనకుమార్, కొమ్ముకూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తునికాకు కార్మికులకు మిగులు నగదు ఇవ్వాలి

విశాలాంధ్ర - వేలేరుపాడు : తునికాకు సేకరణ చేసిన కార్మికులకు మిగులు నగదు వెంటనే ఇవ్వాలని కోరుతూ కుక్కునూరు మండల రేంజర్ కు సిపిఐఎంఎల్ ప్రజాపంథా డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని తునికాకు కార్మికులకు ఇవ్వవలసిన బోనస్ లను వెంటనే విడుదల చేయాలని జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శి ఎస్కె గౌస్ పేర్కొన్నారు. పేద కుటుంబాలు వారే తునికాకు సేకరణ చేస్తారనే విషయాన్ని ప్రభుత్వం గ్రహించాల్సిన అవసరం ఉందన్నారు. నెలలు గడుస్తున్న వారికి రావలసిన నగదు ఇవ్వకుండా ఆలస్యం చేయటం సరైన చర్య కాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గడ్డాల ముత్యాలరావు, పురెం లక్ష్మయ్య, డివిజన్ నాయకులు కట్టం ముత్యాలరావు, కట్టం వీరన్న, తిరుమలాపురం మేడేపల్లి, నార్లవరం సర్పంచులు సోడే విజయ, కట్టం రాంబాబు, మడివి రంగమ్మ, రామవరం, నార్లవరం ఎంపీటీసీలు సోయం చంద్రావు, కట్టం రత్తమ్మ, కుంజ సత్తిబాబు, కారం రాజులు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు గ్యారంటీ చైతన్య రథయాత్ర



విశాలాంధ్ర - రంగంపేట,అనపర్తి : రంగంపేట మండలం వడిశలేరు నుండి పెద్దాడ వరకు భవిష్యత్తుకు గ్యారంటీ జోన్ 2 చైతన్య రథయాత్ర రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.శుక్రవారం ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి చైతన్య రథయాత్ర ప్రారంభించగా వడిశలేరులో యాత్రకు మహిళలు హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు కె ఎస్ జవహర్, బండారు సత్యానందరావు, ఆదిరెడ్డి వాసు, బొడ్డు వెంకటరమణ చౌదరి, జ్యోతుల నెహ్రూ, బొడ్డు సత్తిరాజు, రెడ్డి సుబ్రమణ్యం, కుడిపూడి సత్తిబాబు, పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

జనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-పోడూరు: నేటి నుండి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ సమస్యలు పరిష్కరించుకోవాలని ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు పేర్కొన్నారు. తూర్పుపాలెం ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రంగనాథరాజు మాట్లాడుతూ జగనన్న సురక్ష అమలును జిల్లా మండల అధికారులు అధికారులు, పాల్గొని 11 రకాల సమస్యలను పరిష్కరిస్తా రన్నారు.ఉదయం గం.10 నుంచి సాయంత్రం గం. 6వరకు ప్రతి సచివాలయానికి రోజుకొక గంట చొప్పున సందర్శించి సర్టిఫికెట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.కుల ధ్రువీ కరణ, ఆదాయ ధ్రువీకరణ, జనన ధ్రువీకరణ, మరణ ధ్రువీకరణ, కుటుంబ ధృవీకరణ, వివాహ ధ్రువీకరణ, లావాదేవి మ్యుటేషన్లు, ఫోన్ నెంబర్‌కు ఆధార్ అనుసంధానం, పంట సాగు హక్కు కార్డు వంటి ముఖ్యమైన పత్రాలను నేరుగా ప్రజల ఇంటి వద్ద నూతనంగా రూపొందించిన యాప్‌లో ప్రతిస్పందనలు నమోదు చేసుకొని వారి పత్రాలను సేకరించి టోకెన్ నెంబర్ ద్వారా వారి సమస్యను పరిష్కారం చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

దళితుల సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర-పోడూరు : దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకు వస్తే వాటిని పరిష్కరిస్తానని రాష్ట్ర యస్‌సి కమీషన్ సభ్యులు చెల్లెం ఆనంద ప్రకాష్ అన్నారు. పోడూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం తహసిల్దార్ ఆర్ వి కృష్ణారావు,అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎస్సీ కమిషన్ చెల్లెం ఆనంద ప్రకాష్ ముఖ్య అతిధి గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనంద ప్రకాష్ మాట్లాడుతూ మండలంలో దళితులపై ఏ విధమైన వేధింపులు గాని ఇతర అణిచివేత వంటివి ఏవైనా జరిగితే చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. యస్ సి యస్ టి చట్టాల పట్ల అందరికీ అవగాహన కల్పించలన్నారు. దళితులకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సదుపాయాలను వారి హక్కులను తెలియచేసారు సివిల్స్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేసి మండల స్థాయి అధికారులు గైర్ హాజరు కావడం పట్ల చెల్లెం ఆనంద ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేసి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ డి. సుహాసిని, ఎంపిపి సబ్బితి సుమంగళి సాగర్, సర్పంచ్ లు శెట్టిబత్తుల సువర్ణ రాజు, తానేటి బాబు రావు,దొమ్మటి శ్రీను,పద్మ నాభరాజు, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు,ఎయంసి డైరెక్టర్ గంటా గిరిబాబు,పైడి ఏసుబాబు,దేవస్థానం చైర్మన్ పోడూరి సాయిబాబా,పేరెంట్స్ కమిటీ చైర్మన్ బండి సుబ్బరాజు, ఏఎస్సై జెఈ విక్టర్, పంచాయతీ కార్యదర్శులు,రెవిన్యూ ఇన్స్పెక్టర్ కందుల రాంబాబు, వీఆర్‌ఓలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు మోటార్ వాహనాలు అందజేత

విశాలాంధ్ర - ఆలమూరు : అంబేద్కర్ కోనసీమ జిల్లా మండల కేంద్రమైన ఆలమూరు పంచాయతీ కార్యాలయం వద్ద శాసనసభ్యులు,ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి శుక్రవారం మండలంలో ఉన్న ప్రత్యేక ప్రతిభావంతు లకు (దివ్యాంగులు) 10 త్రిచక్ర మోటార్ వాహనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో దివ్యంగులు కూడా దివ్యమైన వారేనని వారికి పూర్తిస్థాయిలో అండగా ఉండాలని సీఎం జగన్మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయాలు చాలా గొప్పవని, నవరత్నాలు పథకంలో భాగంగా దివ్యాంగులకు అనేక రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా మరొక అడుగు ముందుకు వేసి మండలంలో ఒక్కొక్కటి 92,000 వేల రూపాయలు విలువచేసే త్రిచక్ర మోటార్ వాహనాలను దివ్యాంగులకు అందజేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జడ్పిటిసి తోరాటి సీతామాలక్ష్మి రాంబాబు, వైఎస్‌ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం రామన్నపాలెంలో 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్లకు డ్రైనులకు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో అన్ని గ్రామాలలో మౌలిక సదుపాయాల కోసం నిరంతర కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు మాట్లాడుతూ దేవరపల్లి మండలంలో దేవరపల్లి రామన్నపాలెం చెన్నై గూడెం యాదవోలు త్యాజంపూడి ఎర్నగూడెం గ్రామాలలో సిసి రోడ్లు డ్రైనులు నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ జి జనార్ధన రావు దేవరపల్లి మండల వైసీపీ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ సర్పంచ్ కూచిపూడి బొల్లారావు, జెడ్పీటీసీ పొట్టి స్వర్ణలత, గోపాలపురం జడ్పిటిసి కె లలిత, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం చేరుకున్న అంగన్వాడీల పోరుయాత్ర

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: ఏపీ అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) సమస్యల పై జిల్లా పోరు యాత్ర శుక్రవారం మండల కేంద్రం ఉండ్రాజవరం చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సిహెచ్ మాణిక్యమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.బేబీ రాణిలు మాట్లాడుతూ ఐసిడిఎస్ బడ్జెట్ పెంపు, అంగన్వాడీలకు తెలంగాణ రాష్ట్రం కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలని హెల్పర్ల ప్రమోషన్ లకు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలని, భీమా సౌకర్యం అమలు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. యాత్ర బృందంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏం.సుందర్ బాబు, అంగన్వాడీ జిల్లా నాయకులు ఏ.అజయ కుమారి, వై.సుజాత, డి.వెంకట లక్ష్మి, అన్నపూర్ణ, సిఐటియు ఉండ్రాజవరం మండలం కార్యదర్శి అబ్బు వెంకటేశ్వరరావు, సిఐటియు నాయకులు తూరుగోపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరికల బోర్డులు అందజేత

విశాలాంధ్ర - తాళ్లపూడి : మానవతా ఆధ్వర్యం లో పోలీసు శాఖ వారికి రెండు వైపులా స్టిక్కరింగ్ వేసిన హెచ్చరిక బోర్డులను అందించినట్లు మానవత సంస్థ జోడాల వెంకటేశ్వర రావు తెలిపారు .రాత్రి వేళల్లో మరియు పగటి వేళలో జరిగే ప్రమాదాల నివారణకు వినియోగపడేలా రేడియం స్టిక్కరింగ్ బోర్డులు అందచేసినట్లు స్టేషన్ హౌస్ అధికారి, యస్. ఐ వెంకట రమణ అన్నారు. మానవత చేసే కార్యక్రమాలు చాలా ఉన్నతముగా మరియు ప్రజోపయోగముగా చేస్తున్నారని జోడాల వెంకట్ ను అభినందించారు. వీటిని అత్యంత ప్రమాదకర ప్రదేశాలు ఉన్న చిడిపి గట్టు వద్ద మరియు ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రదేశాలలో గజ్జరం చెరువు మలుపు వద్ద ఏర్పాటు చేయిస్తాము అని యస్.ఐ వెంకట రమణ తెలిపారు. ఈ కార్యక్రమం లో చంద్రయ్య, సాయిన సుబ్బారావు, సభ్యులు అప్పన చంద్ర ధర గుప్త, పోలీసు శాఖ సిబ్బంది ఫణి, నాగేంద్ర, శివరాం, ఏ.యస్.ఐ వర ప్రసాద్, మానవత సభ్యులు పాల్గొన్నారు.

బీసీల రక్షణ చట్టం నిర్ణయం చారిత్రాత్మకం

విశాలాంధ్ర - కరప : బిసిలకు మొదటి నుంచి అండగా ఉన్నది తెలుగుదేశం పార్టీయేనని, బీసీ రక్షణ చట్టం చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు నిర్ణయించడం చారిత్రాత్మకం అని కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మీ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి అన్నారు. కరప మండలం గురజానపల్లిలోని అడివిపూడి గ్రామంలో ప్రజల భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారెంటీతో పాటు "వస్తున్నా మీ గ్రామానికి మీ అనంతలక్ష్మీ" కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వారు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజాసమస్యలను తెలుసుకుంటూ మినీ మేనిఫెస్టో పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాసరావు మాజీ జడ్పిటీసీలు బుంగా సింహాద్రి, మట్టా ప్రకాష్ గౌడ్ నాయకులు పబ్బినీడి చిన్నబాబు, కోటా శ్రీను, జొన్నగంటి గంగరాజు, పాలిక నాగబాబు, లంక శ్రీను, మాసా సత్యనారాయణ, చీపురుపల్లి జియేంద్రబాబు, యాసలపు కన్నబాబు, పులపకూర శుభ మహేష్, వైసుకుమార్, బొజ్జ భవాని సాంబశివరావు, గుత్తుల లక్ష్మీ, పలివెల గాయత్రి త్రిమూర్తులు, గొల్లపల్లి బుజ్జి, మద్దూరి స్వామి, పలివెల జానకిరామయ్య, గంజా రాంబాబు, పెమ్మాడి శ్రీను, దొమ్మేటి వెంకట రమణ, రెడ్డి వీర వెంకట సత్యనారాయణ, చాట్రా ఇమ్మానుయేలు తదితరులు పాల్గొన్నారు.

దశల వారిగా సమస్యలను పరిష్కరిస్తాం

విశాలాంధ్ర - శంఖవరం : దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తామని శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు తెలిపారు. శంఖవరం మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ పర్వత రాజబాబు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఇటీవలే శంఖవరం ఎంపీడీవోగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో గరగ శివరామ కృష్ణయ్యను మర్యాదపూర్వకంగా ఎంపిపి, వైస్ ఎంపిపి, సత్కరించారు. జగనన్న సురక్ష పథకంలో భాగంగా మండలంలో ఇప్పటికే షెడ్యూల్ విడుదలైందని రెండు బృందాలుగా గ్రామాలలో ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తహసిల్దార్ కే సుబ్రహ్మణ్యం వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వర్షాకాలం తొలకరిలో ఇప్పటివరకు 228శాతం వర్షపాతం కురవాల్సిందిగా 150 మాత్రమే నమోదు అయిందని, వ్యవసాయ అధికారి పదాలి గాంధీ తెలిపారు. వివిధ రైతు భరోసా కేంద్రాలలో 40 కింటాలు ఆర్‌జిఎల్ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వరి విత్తనాలు కొరత లేకుండా అందుబాటులో ఉంచాలని ప్రజా ప్రతినిధులు ఎంపీపీ పర్వత రాజబాబు, రామిశెట్టి ఏసుబాబు, ఈగల అప్పారావు, నడిగట్లనానాజీ కోరారు. రైతులకు గట్ల మీద వేసుకోవడానికి కందులు అందుబాటులో ఉన్నాయని ఏఓ తెలిపారు. వైద్యాధికారి శెట్టిబత్తుల రాజీవ్ ప్రజలకు అందే వైద్య సదుపాయాలను తెలియజేశారు. మండలంలో పలు గ్రామాలకు మంజూరయిన పనులు డ్రైనేజ్ నిర్మాణం దాదాపు పూర్తయిందని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ తేజ తెలిపారు. జల్జీవన్ మిషన్ పనులను పూర్తి చేసి మంచినీరు అందించాలని కత్తిపూడి ఎంపీటీసీ సభ్యులు కోరారు. నాడు నేడు రెండో విడత 23 పాఠశాలలో పనులు పూర్తవుతున్నాయని అన్నవరం, కొత్తపల్లి గ్రామాలలో పాఠశాల భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని ఎంఈఓ సూరిశెట్టి వెంకటరమణ తెలిపారు. పాఠశాలలో విద్యా కమిటీ గుర్తించిన పనులు జరుగుతున్నాయన్నారు. శంఖవరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ పద్మావతి ఆశాఖలో జరుగుతున్న పనులను అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న తీరును వివరించారు. ఉపాధి హామీ పథకం ఏపీవోడి రాజ్ గోపాల్ ఆ శాఖలో జరుగుతున్న పనులను వివరిస్తుండగా సర్పంచులు, ఎంపీటీసీలు కలుగజేసుకుని ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి, రైతులకు అనుసంధానించేలా తీర్మానించి ఉన్నతాధికారులకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నాగేష్, జడ్పిటిసి తరుం మల్లేశ్వరి, వైస్ ఎంపీపీలు దార వెంకటరమణ, ఈగల చిన్నములు, సర్పంచులు శెట్టిబత్తుల కుమార్ రాజా, కూనిశెట్టి మాణిక్యం, దూడల రామస్వామి, కార్యదర్శులు చక్రవర్తి, రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర - ఆలమూరు : వైసీపీ ప్రభుత్వం అమలులోకి వచ్చిన తర్వాత గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధిని చూసి మరొకసారి వైసీపీ ప్రభుత్వానికి అవకాశం ఇవ్వండని కొత్తపేట శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన ఆలమూరులో సర్పంచ్ నాతి లావణ్య కుమార్ రాజా,వైసిపి గ్రామ కమిటీ ప్రెసిడెంట్ రావాడ సత్తిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గడపగడపకి మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చిర్ల పాల్గొన్నారు. గ్రామంలో ఆయన పర్యటిస్తూ ప్రజల నుండి సమస్యలను అడిగి తెలుసుకుంటూ వాటిపై అధికారులకు తగిన సూచనలు చేస్తూ గడపగడపకు సందర్శిస్తున్న సమయంలో మహిళలు అధిక సంఖ్యలో ఘన స్వాగతం పలికారు. అనంతరం రైతు బజారు వద్ద 35 లక్షల నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జడ్పిటిసి తోరాటి సీతామాలక్ష్మి రాంబాబు, వైఎస్‌ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో మిగిలిన సీట్లకు పరీక్ష



విశాలాంధ్ర - శంఖవరం : శంఖవరం ఏపీ మోడల్ స్కూల్లో ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతులలో మిగిలిన. సీట్లకు శుక్రవారం ఉదయం పరీక్ష నిర్వహించినట్లు శంఖవరం ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు ఏడవ తరగతి 20 మంది ఎనిమిదవ తరగతి 30 మంది 9వ తరగతి 15 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు తెలిపారు. పరీక్షలలో వచ్చిన మార్కులు ఆధారంగా జూన్ 4వ తేదీన ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి నోటీసు బోర్డులోవారి పేర్లను ఉంచడం జరుగుతుందని ప్రిన్సిపల్ కృష్ణవేణి తెలిపారు.

పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా పట్టణంలోని 15 వ వార్డులో కల్వర్టు నిర్మాణానికి రూ.5లక్షలు,17 వ వార్డులో కల్వర్టు నిర్మాణానికి రూ.7 లక్షలు,18 వ వార్డులో రెండు సీసీ రోడ్లకు రూ.8.40 లక్షలు, డాంగే నగర్ లో నూతన బోరు నిర్మాణానికి రూ.8 లక్షలు,రెండవ వార్డుకు పైప్ లైన్ కు రూ. 2 లక్షలు,శానిటేషన్ కంఫోర్టల్ బిల్ నిమిత్తం రూ.14 లక్షలు,డస్ట్ బిన్ ల కొను గోళ్లకు రూ.3 లక్షలను కౌన్సిల్ లో ప్రతిపాదించారు. స్థానిక అల్లూరి సీతారామరాజు మున్సిపల్ పార్కు నందు జిమ్ ఏర్పాటు చేయడానికి అవసరమైన పరికరాలు కొనుగోలు చేసినందుకు రూ. 6.65 లక్షలు కాంట్రాక్టర్ కు చెల్లించడానికి మున్సిపల్ కౌన్సిల్ ముందుంచగా కౌన్సిల్ ఆమోదించింది. అలాగే పట్టణ ప్రజలు పన్నులు చెల్లించడానికి మొబైల్ టెర్మినల్స్ ను ఏర్పాటు చేశామని వాటి చెల్లింపుల కోసం రూ .89 వేలు చెల్లించడానికి కౌన్సిల్ ముందుంచగా కౌన్సిల్ ఆమోదించింది. పట్టణంలోని పేరం పేట రోడ్డు ను మున్సిపాలిటీ నుండి ఆర్ అండ్ బి శాఖకు బదిలీ చేస్తూ చేసిన తీర్మానాన్ని కౌన్సిల్ ప్రతిపాదించారు. పట్టణంలో జగనన్న లేఅవుట్లో రూ. 8 లక్షతో ఏర్పాటు చేయనున్న బోర్ కు నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. పట్టణంలో పలు వార్డుల్లో రూ.1.36 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సీసీ డ్రైన్ ల నిర్మాణానికి రూ. 6,11 వార్డుల్లో రూ. 18.50 లక్షల టెండర్లను కౌన్సిల్ ఆమోదించింది. మూడో వార్డులో పైపులైన్ నిర్మాణానికి రూ 6.50 లక్షల రూపాయలు, మున్సిపల్ భవనానికి లిఫ్ట్ ఏర్పాటు చేయడానికి రూ.25 లక్షల రూపాయలు టెండర్లకు ఆమోదం తెలిపింది. కౌన్సిలర్లు సంకు సురేష్, రమాదేవి, నేట్రు సుబ్బలక్ష్మి, వలవల తాతాజీ నంబూరు రామచంద్రరాజు, ఉగ్గం దుర్గాప్రసాద్ తదితరులు మాట్లాడుతూ పట్టణంలో శానిటేషన్ పై దృష్టి సారించాలని, వర్షాకాలం కారణంగా ప్రజలకు సీజనల్ వ్యాధులు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని, కుక్కలు పందులు ఇళ్ల మధ్య తిరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, వీధిలైట్లు రిపేర్లు రాకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు ముప్పిడి వీరాంజనేయులు, కంచర్ల వాసవి రత్నం ,మున్సిపల్ కమిషనర్ పి. భవాని ప్రసాద్ ,ఏఈ సంధ్యారాణి ,మున్సిపల్ సిబ్బంది ఆ యా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - పెద్దాపురం : ఈనెల 1వ తేదీ నుండి గ్రామాల్లో నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని గుడివాడ సచివాలయంలో పర్యటించారు. ఉద్యోగులకు, సచివాలయ సిబ్బందికి, వాలంటీర్లకు పలు సలహాలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో సీతారామరావు మాట్లాడుతూ ప్రతి ఒక్క లబ్ధిదారుడికి రాష్ట్ర ప్రభుత్వం అందించే పలు ప్రజా సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ట్రైనీ కలెక్టర్ ప్రభాకర్ జైన్, ఎంపీడీవో అశోక్ కుమార్, సర్పంచ్ కనపర్తి సీమదొర, పంచాయతీ కార్యదర్శి ఏ భారతి తదితరులు పాల్గొన్నారు.

మానవత నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

విశాలాంధ్ర - తాళ్లపూడి : మానవత స్వచ్చంద సేవా సంస్థ, తాళ్లపూడి మండల శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం స్థానిక సొలస సత్యనారాయణ - దమయంతి కళ్యాణ మండపంలో సంస్థ మండల అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గడిచిన సంవత్సర కాలంలో సంస్థ ద్వారా చేపట్టిన కార్యక్రమాలను ఆయన వివరించారు. సంస్థ గౌరవ చైర్మన్ సింహాద్రి జనార్దన్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మానవత్వం కలిగి ఉండాలని, మానవ సేవే మాధవ సేవ అని కొనియాడారు. మానవత జిల్లా శాఖ అధ్యక్షులు గంగాధరం ముఖ్య అతిథిగా హాజర య్యారు. మానవత అందిస్తున్న సేవా కార్య క్రమాలను వివరించారు. ఎన్నో కార్యక్రమాలను చే పట్టిన తాళ్లపూడిలో సంస్థ ను అభినందించారు. అనంతరం ఎన్నుకోబడిన నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గం అధ్యక్షులు గా సాయన సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా అంకేం సురేష్, కార్యదర్శి గా తీగిరిపల్లి దోసాలు, సహాయ కార్యదర్శిగా పెమ్మడి దుర్గాప్రసాద్, కోశాధికారిగా అప్పన వీర హనుమంతరావు, ఈ.సి మెంబెర్లుగా సనపల రాజశేఖర్, విజరపు వెంకట కృష్ణా శ్రీనివాస్, అబ్బిశెట్టి ప్రకాష్, తీగిరిపల్లి రామన్న లు ఎన్నుకోబడ్డారు.

లక్కరాజు శేషకుమారి ఉమెన్ ఎంపవర్‌మెంట్-2023'

విశాలాంధ్ర - కాకినాడ : జెఎన్‌టియుకె ప్రాంగణంలో శుక్రవానెరం సెనేట్ హాలులో లక్కరాజు శేషకుమారి ఉమెన్ ఎంపవర్‌మెంట్-2023' కార్యక్రమాన్ని ప్రముఖ స్వచ్చంద సేవా సంస్థ సంకురాత్రి ఫౌండేషన్ మరియు జెఎన్‌టియుకె వారు సంయుక్తంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉపకులపతి ప్రొ జివిఆర్ ప్రసాదరాజు విచ్చేయగా విశిష్ట అతిథులుగా మాజీ కేంద్ర మంత్రి ఎంఎం పళ్లంరాజు, ప్రముఖ హెరిటేజ్ యాక్టివిస్ట్ & ట్రాన్స్‌పోర్ట్ చరిత్రకారులు అనురాధా రెడ్డిలు సంకురాత్రి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ వర్చువల్‌గా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందుగా లక్కరాజు శేషకుమారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొ జివిఆర్ ప్రసాదరాజు వివిధ రంగాలలో లక్కరాజు శేషకుమారి చేసిన సేవలను కొనియాడారు. ప్రతీ విద్యార్థి లక్కరాజు శేషకుమారిని ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. మాజీ కేంద్ర మంత్రి ఎంఎం పళ్లంరాజు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు శేషకుమారిని స్ఫూర్తిగా తీసుకుని సమాజాభివృద్ధికి పాటుపడాలని, ఆమె ఆశయాలను ముందుకు తీసుకువెళ్ళాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. అనురాధా రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతీ రంగంలోను పురుషులతో పాటు సమానంగా మహిళలకు కూడా సమాన అవకాశాలు కల్పించాలని, దానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. భారతదేశంలోని ప్రముఖ ప్రదేశాలు, హెరిటేజ్ భవనాలు, వారసత్వ కట్టడాల గురించి వివరించారు. లక్కరాజు సత్యనారాయణ (టిక్కు) మాట్లాడుతూ తన తల్లి లక్కరాజు శేషకుమారి జ్ఞాపకార్థం ప్రతీ సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జెఎన్‌టియుకె మరియు సంకురాత్రి ఫౌండేషన్ సంస్థలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు మాట్లాడుతూ అనురాధా రెడ్డిలా కనీసం 40 దేశాలైనా పర్యటించాలని అనుకుంటున్నామన్నారు. ధైర్యంగా ఉండాలని, సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనాలని స్ఫూర్తి పొందామని విద్యార్థినులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ ఎల్ సుమలత, డైరెక్టర్‌లు, సంకురాత్రి ఫౌండేషన్ ప్రతినిధులు, స్వచ్ఛంధ సేవా సంస్థల ప్రతినిధులు, వైద్యులు, ఇంజనీర్లు, జెఎన్‌టియుకె, శారదా విద్యాలయం, ఆదిత్య విద్యాసంస్థలు, కైట్ విద్యా సంస్థలు, ప్రగతి విద్యాసంస్థల నుండి విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

విశాలాంధ్ర - పెదపూడి : అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దేశంలోనే అగ్రస్థానంలో వున్నారని అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. పెదపూడి మండలం రామేశ్వరం గ్రామంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ కొటికలపూడి చినబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో కలిసి గడప గడపకు వెళ్లి ప్రజలను కలుసుకుని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్దిదారులకు వివరించారు.

గడప గడపకు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం : గ్రామంలో ఎమ్మెల్యే ఏ గడపకు వెళ్లిన పెద్ద ఎత్తున స్థానికులు ఎదురువచ్చి హారతిలతో ఘన స్వాగతం పలికారు. పూలమాలలు వేసి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు.పెదపూడి మండలాన్ని కాకినాడ జిల్లాలో కలపడానికి ఎమ్మెల్యే చేసిన కృషికి రామేశ్వరం ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి వెంకటరమణ, సర్పంచి కొటికలపూడి చినబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఉప సర్పంచి కొటికలపూడి వరలక్ష్మి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.